క్లుప్తంగా

వైకుంఠధామం పనులు పరిశీలన



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శివాజీచౌక్, మంచిర్యాల చౌరస్తా వద్ద గల వైకుంఠధామం పనులను మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము ఆదివారం పరిశీలించారు. మంత్రి ఐకే రెడ్డి సహకారంతో అధునాతన హంగులతో వైకుంఠ ధామం నిర్మిస్తున్నామని తెలిపారు. మిగిలిన నిర్మాణ పనులు సోమవారం నుంచి కొనసాగుతాయన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు రామగోని తులసి–నర్సాగౌడ్, అబ్దుల్ మతిన్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలి



సన్మానిస్తున్న సర్పంచ్ అంజనాబాయి

సర్సాపూర్(జి): గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని అంజనీతండా సర్పంచ్ జాదవ్ అంజనా బాయి పేర్కొన్నారు. గ్రామానికి చెందిన రాథోడ్ సుధీర్ కుమార్, చౌహాన్ నిఖిత, రాథోడ్ సింధులు బాసర, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినందుకు గాను, జూనియర్ లెక్చరర్ (జేఎల్) రాథోడ్ శ్రీనివాస్‌ను ఆదివారం సన్మానించారు. ఉప సర్పంచ్ జాదవ్ అంబర్ సింగ్, శంకర్ నాయక్, బలరాం, జాదవ్ శ్రీనివాస్, శ్యామ్ రావు, రాథోడ్ శ్రీనివాస్, తానాజీ, పండిత్ నాయక్, మంగళ్ పాల్గొన్నారు.

సన్మానం



లహరిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కుంటాల: మండల కేంద్రానికి చెందిన శివ లింగం కుమార్తె లహరి, జగదీశ్వర్‌చారి కుమారుడు భరద్వాజ్‌లు స్థానిక ఆదర్శ పాఠశాలలో పదోతరగతి చదివి ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించారు. వీరిని కుంటాలలో 1994–95 పూర్వ విద్యార్థులు ఆదివారం సన్మానించి అభినందించారు. పడకంటి దత్తాత్రి, సురేందర్, చంద్రయ్య, రవీందర్, నవీన్, శ్రీనివాస్, హుస్సేన్, సాయిబాబా, మునీర్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన కళాకారుడు నారాయణ గతంలో అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబీకులు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో రూ.75 వేల ఆర్థికసాయం మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును ఆదివారం బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. వీడీసీ అధ్యక్షుడు ఉత్తం బాలేరావ్, సర్పంచ్ ఆనంద్, నాయకులు టక్కన్ రాజు, శివకుమార్ తదితరులు ఉన్నారు.

సర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండాకు చెందిన జాదవ్ రమేశ్‌కు మంజూరైన రూ.20 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సర్పంచ్ జాదవ్ అంజనాబాయి ఆదివారం అందజేశారు. ఉప సర్పంచ్ అంబర్‌సింగ్, జాదవ్ కైలాష్, జాదవ్ శ్రీనివాస్, రాథోడ్ శ్రీనివాస్, తానాజీ, మంగళ్ పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం



భోజనం వడ్డిస్తున్న రమాదేవి

కుభీర్: మండలంలోని పార్డి(బి) రాజరాజేశ్వర మందిరంలో గత ఏడు రోజులుగా కొనసాగుతున్న సప్తాహం ఆదివారంతో ముగిసింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.మోహన్ ఉట్టి కొట్టి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి పాల్గొని భోజనం వడ్డించారు. సర్పంచ్ పుష్ప, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెండేళ్లయినా మరమ్మతు ఏది?

- ప్రమాదకరంగా యాకర్‌పెల్లి ప్రధాన రహదారి, కల్వర్టు
- వర్షాలకు కోతకు గురైన రోడ్లు
- పట్టించుకోని అధికారులు



యాకర్‌పెల్లి రహదారిపై కోతకు గురై ప్రమాదకరంగా కల్వర్టు

సారంగపూర్: మండలంలోని జామ్ నుంచి యాకర్‌పెల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డు మధ్యలో కల్వర్టు కోతకు గురై రెండేళ్లు గడిచినా ఇప్పటికి మరమ్మతు చేపట్టకపోవడంతో ప్రజలు ప్రమాదపుటంచున ప్రయాణాన్ని కొనసాగించాల్సి వస్తోంది. రహదారిపై తారులేచి గుంతలు పడి చిన్నపాటి వర్షానికే గుంతలో నీరు నిలిచిపోయి నరకప్రాయంగా మారింది. గత రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు, రోడ్డు సగం కోతకు గురైంది. కల్వర్టుకు వేసిన పైపులు తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈక్రమంలో యాకర్‌పెల్లి గ్రామ పంచాయతీ నిధులతో కొంత మొరం వేయించి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేపట్టారు. మళ్లీ గతేడాది వర్షాలకు మొరం కొట్టుకుపోయి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు ఇదే కల్వర్టుపై రెండు పైపులు జాయింట్ అయ్యే ప్రదేశంలో బుంగపడింది. ఇది రోడ్డు మధ్యలో ఉండటంతో అది గమనించక వాహనాలు నడిపితే అందులో కూరుకుపోయి ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

టెండరు పూర్తయినా ప్రారంభం కాని పనులు..

రోడ్డు మరమ్మతుకు ప్రభుత్వం రూ.60 లక్షల నిధులు మంజూరు చేసింది. బీటీ నిర్మించడంతోపాటు కల్వర్టు మరమ్మతు పనులకు గత రెండు నెలల క్రితమే టెండరు ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టు సంస్థ మాత్రం ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. దీంతో జామ్, యాకర్‌పెల్లి గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు.

కోతకు గురైన రవీంద్రనగర్ రహదారి

సారంగాపూర్–రవీంద్రనగర్ వెళ్లేదారిలో సారంగపూర్ కుంట సమీపంలో మూలమలుపుపై రోడ్డు కోతకు గురైంది. ఈ రహదారి మీదుగా నాగాపూర్, చర్చితండా, రవీంద్రనగర్ గ్రామాల ప్రజలతోపాటు అడెల్లి ఆలయానికి వెళ్లే భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. కాగా, ఈ రహదారి మూలమలువు వద్ద కనిపించకుండా రోడ్డు కోతకు గురైంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు అది గమనించకపోతే పెద్ద ప్రమాదమే సంభవించే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేపట్టాలని గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.



రవీంద్రనగర్ రహదారిలో కోతకు గురైన రోడ్డు



కల్వర్టు మిగిలిన భాగంలో గుంతపడి కూరుకుపోతున్న రోడ్డు

మరమ్మతు చేపట్టాలి



రోడ్డు గుంతలు పడడంతోపాటు కల్వర్టు కొట్టుకుపోయి రెండేళ్లు గడిచింది. ఇంతవరకు దానికి మరమ్మతు మాత్రం చేయించలేదు. ఇటీవల గ్రామానికి చెందిన దాదాపు నలుగురైదుగురు కల్వర్టు సమీపంలో పడి గాయాలపాలయ్యారు. రోడ్డు, కల్వర్టుకు మరమ్మతు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మహేందర్, యాకర్‌పెల్లి

టెండరు ప్రక్రియ పూర్తయింది

యాకర్‌పెల్లి రహదారి, కల్వర్టు నిర్మాణానికి రూ.60 లక్షల నిధులు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టు సంస్థతో పనులు ప్రారంభించాలని సూచించాం. వర్షాల నేపథ్యంలో పనులు ప్రారంభించలేదు. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. రవీంద్రనగర్ రహదారి రోడ్డు కోతకు గురైన ప్రదేశాన్ని పరిశీలించాం. వర్షాలు తగ్గితే అది పూర్తి చేయిస్తాం.

– శరత్, పీఆర్, ఏఈ, సారంగాపూర్

అటెన్షన్ ప్లీజ్ — గుంతలు పూడ్చరూ..



లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం నుంచి మల్లాపూర్, మునిపెల్లి, మాచాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చివేసేలా చర్యలు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– అంజనేశ్వర్, ఏఈ, ఆర్అండ్‌బీ, సెల్: 70210 07310

ఇంటర్ టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహాన్ని అందజేస్తున్న సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన టాపర్లకు కళాశాల పూర్వవిద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. 981 మార్కులు సాధించిన నసీరా తర్నానికి రూ.5 వేలు, సఫియా సుల్తానా(948 మార్కులు)కు రూ.3 వేలు, సందు కావ్య(935 మార్కులు)కు రూ.2 వేల నగదు అందజేశారు. డీఐఈవో పరుశురాంనాయక్, కళాశాల పూర్వవిద్యార్థుల కమిటీ కన్వీనర్ వాల్గొట్ కిషన్, సభ్యులు యూసుఫ్‌ఖాన్, బోనగిరి నరేందర్, చిలుకూరి వెంకట్రాములు, రవీందర్‌గౌడ్, మడిగెల గంగాధర్, రాచమల్ల రాజశేఖర్, గౌరికార్ రాజు, గోవింద్‌నాయక్, విద్యాసాగర్, గంగాధర్, శ్రీనివాస్, నదీమ్, వెంకటరమణ ఉన్నారు.

వాహనాల తనిఖీ

కుంటాల: రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై హన్మాండ్లు సూచించారు. ఆదివారం సాయంత్రం అర్లి(కే) క్రాస్ రోడ్డు 61 జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన ధ్రువపత్రాలు పరిశీలించారు. ధ్రువపత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఎస్సై మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్సై రాందాస్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన



పెంబిలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

ముథోల్/పెంబి/కడెం/దస్తురాబాద్/ఖానాపూర్/ఉట్నూర్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఆదివారం వినూత్నంగా కార్మికులు తిరుగుతూ భిక్షాటన చేశారు. వ్యాపారులు, ప్రజలు తమకు తోచిన ఆర్థికసాయం అందించి వారికి సంఘీభావం తెలిపారు. ఉట్నూర్‌లో కార్మికుల సమ్మెకు టీపీసీసీ క్యాంపెయిన్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ మద్దతు తెలిపారు.



ఖానాపూర్: భిక్షాటన చేస్తున్న కార్మికులు

గోరింటాకు వేడుకలు

ఖానాపూర్: ఆషాఢమాసం పురస్కరించుకొని పట్టణంలోని టవర్స్ కాలనీలో ఆదివారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. మహిళలు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు.



బీజేపీతోనే అభివృద్ధి



ప్రజలతో మాట్లాడుతున్న మోహన్ రావు పటేల్

కుభీర్: రాష్ట్రంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు బోస్లే మోహన్ రావు పటేల్ అన్నారు. గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సిర్పెల్లి, సిర్పెల్లి తండా, పెంటునాయక్ తండా, ఫకీర్ నాయక్ తండాలో ఆదివారం ఆయన పర్యటించారు. గత 9 ఏళ్లలో మోదీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో ఎన్నికల హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ ప్రభుత్వానికి త్వరలో ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీని గెలిపించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగం, నాయకులు వెంకటస్వామి, అజయ్, తదితరులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం ..భైంసా నుంచి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు మహ్మద్ ఫిరోజ్ ఆటోలో 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నాడు. దేగాం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టి పీడీఎస్ బియ్యంతో వెళ్తున్న ఆటోను గుర్తించి పట్టుకున్నారు. ఆటో, బియ్యంతోపాటు నిందితుడు ఫిరోజ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖానాపూర్: 33 కేవీ పెంబి విద్యుత్‌లైన్ మరమ్మతు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ కౌట్టి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని సత్తన్‌పలి, పాత ఎల్లాపూర్, బీర్నంది, కడెం మండలంలోని లింగాపూర్, పెంబి మండల కేంద్రాల్లోని విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.



భైంసా: భాజాభజంత్రీలతో ఆలయాలకు వెళ్తున్న గ్రామస్తులు



జిల్లాకేంద్రంలోని ఆలయ ఆవరణ వద్ద భక్తులు

బోనమెత్తిన నిర్మల్

నిర్మల్‌టౌన్/భైంసాటౌన్/భైంసా: పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల ఆట పాటలతో జిల్లా అంతటా బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసం చివరిరోజు ఆదివారం పోచమ్మ, మైసమ్మ ఆలయాల్లో, గ్రామదేవతలకు భక్తులు పూజలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనం పెట్టుకుని ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు సమర్పించారు. సల్లంగ చూడు తల్లీ..అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ ప్రధాన ద్వారానికి ఆదుముల్ల కిషన్(రిటైర్డ్ డీఎఫ్‌వో) కుటుంబసభ్యులు ఇత్తడి తాపడాన్ని విరాళంగా అందించారు. జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో సమైక్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు పోచమ్మ తల్లి అమ్మవారికి బోనం సమర్పించారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము పూజలు చేశారు. భైంసాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావుపటేల్, భోస్లే మోహన్‌రావు పటేల్ పూజలు చేశారు. బాసరలోని ఆలయాలు, ట్రిపుల్ ఐటీ ఆవరణలో డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, ఉద్యోగులు పోచమ్మ తల్లికి నైవేద్యం, బోనం సమర్పించారు.



బోనంతో వెళ్తున్న శాంతినగర్ డెవలప్మెంట్ కమిటీ



భైంసాటౌన్: బోనాలతో వెళ్తూ..



బోనమెత్తుకున్న రామారావుపటేల్



నిర్మల్‌టౌన్: పోతరాజుల వేషధారణతో చిన్నారులు



నిర్మల్‌లో భక్తుల క్యూ

ఘనంగా భీమన్న పండుగ



పూజలు చేస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండల కేంద్రంలో భీమన్న పండుగను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులు ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. భీమన్న సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు చేశారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో గజ్జలమ్మకు అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ నిర్వహించారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

కుంటాల: ప్రమాదాలు జరగకుండా అందరూ క్షేమంగా ఉండాలని ఆటో యూనియన్ సభ్యులు మండలంలోని వెంకూర్ పెద్దమ్మ ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కు చెల్లించారు.

ఆటోడ్రైవర్లకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న యజమానులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ఇండియన్, హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ల యజమానుల ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. బంక్ యజమానులు బ్రహ్మయ్య, సత్యపాల్‌రెడ్డి, సాయారెడ్డి, ఆటో యూనియన్ సభ్యుడు రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి మొక్కులు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. అమ్మవారికి మొక్కు చెల్లించి నైవేద్యాలు సమర్పించారు.